
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024



విద్యార్థులకు నేత్ర పరీక్షల కోసం ప్రణాళిక

- జిల్లాలో 73,515 మంది తనిఖీలు

పాడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు విద్యాలయాల్లోని 73,515 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు గురువారం తెలిపారు. జిల్లాలోని 386 విద్యాలయాల్లోని విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. రానున్న మూడు నెలల్లో లక్ష్యం మేరకు కంటి పరీక్షలు చేపడతామన్నారు.

ఏజెన్సీని డోలీ మోతల రహితం చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న టీడబ్ల్యూ పీఎస్ కన్నబాబు, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, ఈ ప్రాంతాన్ని డోలీ మోతల రహితం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతల అవసరం లేకుండా రవాణా సదుపాయాలు మెరుగు పరచాలన్నారు. ఏజెన్సీలో రహదారుల నిర్మాణాలు, కాఫీ ప్రాజెక్టు విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. అలాగే అత్యవసరమైన వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదించాలన్నారు. చింతపల్లి మండలం తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మూజియంలో సివిల్ పనులను పూర్తిచేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల మరమ్మతులు, కనీస సౌకర్యాలు, అకడమిక్ కార్యాచరణ ప్రణాళికపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏజెన్సీలో వసతిగృహాలకు యూపీఎస్ విద్యుత్ సౌకర్యం సమకూర్చాలని, అటవీ హక్కుల చట్టంలో పరిష్కరించాల్సిన క్లైమ్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ పథకాల్లో భాగంగా చేపట్టిన పనుల పురోగతి, బిల్లుల చెల్లింపుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వివరించారు. ఈ సమీక్షలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్‌ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్‌ఎం.రాజు, కె.వేణుగోపాల్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సి.జమాల్ బాషా, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె.కృష్ణారావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, కాఫీ బోర్డు ఇన్‌చార్జి డీడీ రమేశ్, పీహెచ్‌వో ఎన్.అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాడేరు మండలం గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న టీడబ్ల్యూ పీఎస్ కన్నబాబు

గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు పాడేరు మండలం గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సాయంత్రం సందర్శించారు. అక్కడ బాలికలకు అందిస్తున్న విద్య, ఇతర సదుపాయాలను పరిశీలించారు. సూపర్-50లో భాగంగా టెన్త్ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధనను పరిశీలించారు. అనంతరం ప్రత్యేక బోధన పొందుతున్న బాలికలతో మాట్లాడారు. చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, టీచర్లు పాల్గొన్నారు.



గుత్తులపుట్టులో సికిల్ సెల్ ఎనీమియా బాధిత విద్యార్థికి రూ.10 వేలు పెన్షన్ అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

తొలిరోజు 95.89 శాతం పెన్షన్ల పంపిణీ

జిల్లాలో 1,25,946 పెన్షన్లకు 1.20,774 మందికి అందజేత

పాడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతికూల పరిస్థితులను అధిగమించి తొలి రోజు గురువారం 95.89 శాతం సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లాలో సగానికి పైగా పల్లెలకు రోడ్లు, సమాచార వ్యవస్థ సరిగా లేని పరిస్థితుల్లో సైతం గురువారం రాత్రి 8 గంటలకు మొత్తం 1,25,946 మంది లబ్ధిదారులకుగానూ 1,20,774 మందికి పెన్షన్లను అందించారు. ఇంకా 5,172 మందికి పెన్షన్లు అందించాల్సి ఉంది. మారుమూల గిరిజన పల్లెల్లో పెన్షన్ల పంపిణీకి వెళ్లిన సిబ్బంది రాత్రికి గాని తిరిగి రాని పరిస్థితి. వారంతా మండల, డివిజన్ కేంద్రాలకు చేరుకుంటే జిల్లాలో దాదాపుగా శత శాతం పంపిణీ పూర్తవుతుందని, అయినప్పటికీ కొన్ని పెన్షన్లు మిగిలితే వాటిని శుక్రవారం పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

డీఆర్‌డీఏ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పెన్షన్ల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలోని సచివాలయాల వారీగా జరుగుతున్న పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించడంతో పాటు ఎక్కడైనా పంపిణీలో జాప్యం జరిగినా, ఇబ్బందులు ఏర్పడినా కాల్ సెంటర్ ద్వారా వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పలువురికి కలెక్టర్ పెన్షన్ల పంపిణీ

పాడేరు మండలంలో గుత్తులపుట్టు సచివాలయం పరిధిలోని పలువురు లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం పెన్షన్లను పంపిణీ చేశారు. సికిల్ సెల్ ఎనీమియా విద్యార్థి శ్రీనివాసరావుకు రూ.10 వేలు, వృద్ధులు ... మిగతా 8వ పేజీలో

పెరుగుతున్న ఆశావహులు

- ఈనెల 30న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక
- ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

- తనకే అవకాశం దక్కుతుందని విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ధీమా
- తాజాగా తెరపైకి మాజీ మంత్రులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు పేర్లు
- తన పేరు పరిశీలించాలని కోరుతున్న మాజీ ఎంపీ ఎంవీవీ
- మరోవైపు తనకు ఇవ్వాలంటూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ పట్టు



బూడి ముత్యాలనాయుడు



గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ టికెట్‌కు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ పదవికి, పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఖాళీ అయిన స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో వైసీపీలో పలువురు నేతలు సీటు కోసం ప్రయత్నాలు మొదలెట్టారు.

మూడున్నరేళ్ల క్రితం (2021 ఫిబ్రవరి) జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాడు అధికారంలో ఉన్న వైసీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. దీంతో రెండున్నరేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవులు వైసీపీ దక్కించుకుంది. అందులో ఒక స్థానానికి నగరానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను, రెండో స్థానానికి వరుదు కళ్యాణిని ఎంపిక చేసింది. వంశీకృష్ణశ్రీనివాస్ గత ఏడాది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయ్యింది. ఆ స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో వైసీపీలో పలువురు పోటీ పడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని స్థానిక సంస్థల్లో వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఆశావహులు పెరుగుతున్నారు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న కోలా గురువులు ఎమ్మెల్యేగా పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పంపించాలని ఆ పార్టీ అధిష్ఠానం భావించినా క్రాస్ ఓటింగ్ కారణంగా ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని పార్టీకి విధేయుడిగా ఉన్న గురువులుకు కేటాయిస్తారని పార్టీలో ప్రచారం జరిగింది. ఆయన కూడా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. వచ్చే ఐదేళ్లపాటు పార్టీ తరఫున పోరాటం చేయాలంటే తమకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు బూడి ముత్యాలనాయుడు గట్టిగా అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టిన తనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పార్టీ నేతల వద్ద వాపోయినట్టు తెలిసింది. వీటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే తనకు చట్టబద్ధమైన పదవి ఏదో ఒకటి ఉంటేనే తప్ప సాధ్యం కాదని అధిష్ఠానానికి విన్నవించినట్టు సమాచారం. ఐదేళ్లపాటు నిలదొక్కుకోవడానికి మాత్రమే ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ కూడా ఎమ్మెల్సీగా ... మిగతా 8వ పేజీలో

గ్యాస్ ఈకేవైసీ పేరిట దోపిడీ

ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 400 వసూలు

- జీకేవీధి గ్యాస్ ఏజెన్సీ నిర్వాకం
- గిరిజనులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ఈకేవైసీ కోసం గ్యాస్ కార్యాలయం వద్ద క్యూకట్టిన వినియోగదారులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఈకేవైసీ పేరిట ఆదివాసీలను దోపిడీ చేస్తున్నారు. ఒక్కొక్క లబ్ధిదారుడు నుంచి రూ. 400 వసూలు చేస్తున్నారు. చింతపల్లి జీసీసీ కార్యాలయంలో ఉచితంగా ఈకేవైసీ చేస్తుంటే.. జీకేవీధిలో ఎందుకు డబ్బులు తీసుకుంటున్నారని వినియోగదారులు ప్రశ్నిస్తే.. ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత గ్యాస్ సిలిండర్లు కావాలంటే నగదు చెల్లించాల్సిందేనని నిర్వాహకులు చెబుతున్నారు. గురువారం ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల అక్రమ వసూళ్లను బాధితులు విలేకరులకు తెలియజేశారు. గతంలో జీకేవీధి మండల కేంద్రంలో జీసీసీ గ్యాస్ సరఫరా చేసేది. నాలుగేళ్ల క్రితం హెచ్‌సీ గ్యాస్ నిర్వహణ బాధ్యతలు సత్యదుర్గా క్షేత్రియ విత్రక్ ఏజెన్సీకి అప్పగించారు. ఈ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో పది వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం అక్రమ కనెక్షన్లను తొలగించేందుకు వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. అయితే ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం త్వరలో ఉచితంగా అందజేసే మూడు సిలిండర్లు రావంటూ ఏజెన్సీ నిర్వాహకులు విస్తృతంగా ప్రచారంచేశారు. దీంతో ప్రభుత్వం అందజేసే ఉచిత సిలిండర్లను ఎక్కడ కోల్పోతామోనని ఆదివాసీలు ఈకేవైసీ చేయించుకునేందుకు గ్యాస్ కార్యాలయానికి భారీగా తరలి వస్తున్నారు. ఇదే అదనుగా భావించిన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కొక్క వినియోగదారుడు నుంచి రూ.400 వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకోలేదని ... మిగతా 8వ పేజీలో

అలసత్వంతో మరణాలు సంభవిస్తే చర్యలు

- వైద్యారోగ్యశాఖాధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరిక
- సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు వేగవంతం చేయాలని సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా మరణాలు సంభవిస్తే వారిపై తీవ్ర చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలోని వైద్యారోగ్య సేవలపై గురువారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో వైద్య సేవలు, యాంటీ మలేరియా యాక్టివిటీ జరుగుతున్నప్పటికీ మరణాలు చోటుచేసుకోవడంపై సీనియర్ అధికారులతో విచారణ జరిపిస్తామని, వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు చేపడతామన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని, ఈ క్రమంలో వైఫల్యం చెందితే కఠిన చర్యలు చేపడతామన్నారు. జూలై నెలలో మూడు మాతృ మరణాలు చోటుచేసుకున్నాయని, వాటిపై ఆయన ఆరా తీశారు. అలాగే ఇతర ప్రాంతాల కంటే జిల్లాలో తక్కువగా మలేరియా కేసులు నమోదు కావడంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే మలేరియా నియంత్రణ చర్యలు పక్కాగా చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రక్త పరీక్షల నిర్వహణ పక్కాగా చేపట్టాలని, జిల్లా మలేరియా అధికారి క్షేత్ర పర్యటనలో గుర్తించి సమస్యలు, ఇతర అంశాలను తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలోనూ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు వేగంగా నిర్వహించాలని, హుకుంపేట, జీకేవీధి, లంబసింగి, పెదబయలు పీహెచ్‌సీల్లో పరీక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా కార్యక్రమాలకు ఆస్పత్రి అభివృద్ధి నిధులను వ్యయం చేయాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు వ్యయం చేయకుండా మురగబెడితే చర్యలు తప్పవని కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.కృష్ణారావు, జిల్లాలోని వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాటిగుడ.. వసతులు ఎక్కడ?



వ్యూపాయింట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్

- టీడీపీ ప్రభుత్వ హయాంలో జలపాతం వద్ద అభివృద్ధి పనులు
- పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసీపీ సర్కారు
- సౌకర్యాలు లేక పర్యాటకుల అవస్థలు

అనంతగిరి, ఆగస్టు 1: **మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతం వద్ద కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. దీని వల్ల ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అవస్థలు తప్పడం లేదు.**

ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో తాటిగుడ జలపాతాన్ని రూ.35 లక్షలతో అభివృద్ధి చేశారు. జలపాతాన్ని ఆనుకుని వ్యూపాయింట్, మినీ రెస్టారెంట్, స్నానం చేసిన తరువాత దుస్తులు మార్చుకునేందుకు రెండు గదులు, జలపాతం వద్దకు వెళ్లేందుకు మెట్లను నిర్మించారు. దీంతో అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చేవారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో దీని నిర్వహణకు గాలికి వదిలేసింది. మినీ రెస్టారెంట్, దుస్తులు మార్చుకునే గదుల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో అక్కడికి వెళ్లే దారే లేకుండా పోయింది. మెట్లపై నుంచి నీరు పారుతుండడంతో నాచు పట్టి ప్రమాదకరంగా తయారైంది. మెట్లను ఆనుకుని ఉన్న ఇనుప రెయిలింగ్ వద్ద ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు ఉంటాయని పర్యాటకులు భీతిల్లుతున్నారు. అలాగే ఎత్తైన ప్రదేశంలో నిర్మించిన వ్యూపాయింట్ వద్ద గల స్టీల్ రెయిలింగ్ ఊగిపోతుండడంతో పర్యాటకులు భయపడుతున్నారు. ఇప్పటికైనా పర్యాటక శాఖ అధికారులు స్పందించి దీనికి పూర్వ వైభవం తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.



దుస్తులు మార్చుకునే గది దుస్థితి

యర్రవరం జల సవ్వడి



ఉరకలేస్తున్న జలపాతం

మండలంలోని యర్రవరం జలపాతం ఉరకలేస్తున్నది. గిరిజన ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలపాతం వంద అడుగుల ఎత్తు నుంచి జలజలపారుతూ సవ్వడి చేస్తోంది. వీక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నది. - చింతపల్లి

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

వాతావరణ మార్పులతో పెరుగుతున్న సముద్ర మట్టాలు

- 1992 నుంచి 2021 వరకూ 2.381 సెంటీమీటర్ల మేర పెరిగిన నీటి మట్టం
- ఏడాదికి సగటున 0.181 సె.మీ. పెరుగుదల
- 2040కల్లా తీరంలో 6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నీట మునిగే ప్రమాదం
- ప్రమాదంలో పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేట బీచ్‌లు

-7లో

క్రైం... crime news

రెండు దేవాలయాల్లో హుండీలు చోరీ



విజయరామరాజుపేట ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీకి గురైన హుండీ



విజయరామరాజుపేట స్మశానంలో పారేసిన హుండీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 1: విజయరామరాజుపేటలో రెండు దేవాలయాలకు చెందిన హుండీలు చోరీకి గురయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దొంగలు స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ తాళం పగులకొట్టి నగదు దోచుకెళ్లారు. అలాగే పోలేపల్లి అమ్మవారి ఆలయ హుండీని ఎత్తుకెళ్లిపోయారు. కాగా మరో గ్రామానికి చెందిన దేవాలయం హుండీ లోని నగదు అపహరించిన దొంగలు స్థానిక స్మశానంలో దానిని పారేశారు. దేవాలయాల్లో హుండీలు చోరీపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

కొయ్యూరు, ఆగస్టు 1: ఒడిశా నుంచి కాకినాడకు తరలిస్తున్న 60 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం మండలంలోని కినపర్తి పంచాయతీ భీమవరం శివారులో తమ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆటోలో తరలిస్తున్న 60 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయి తరలిస్తున్న ఒడిశాలోని నేరడపల్లికి చెందిన ఒక వ్యక్తితో పాటు చింతపల్లి మండలానికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జూదం ఆడుతున్న 12 మంది అరెస్టు

» 9 ద్విచక్ర వాహనాలు, రూ.23,092 నగదు స్వాధీనం

కొయ్యూరు, ఆగస్టు 1: మండలంలో మూలపేట పంచాయతీ కొండ సంత గ్రామ శివార్లలో చిత్తులాట (ఎగరకానులు) శిబిరంపై గురువారం కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,092 నగదుతో పాటు 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మరో 11 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు.

సైబర్ మోసంపై పోలీసులకు ఫిర్యాదు

దేవరాపల్లి, ఆగస్టు 1: సైబర్ నేరగాళ్ల చేతిలో దేవరాపల్లికి చెందిన ఓ యువకుడు మోసపోయాడు. తన బ్యాంకు ఖాతా నుంచి రూ.94 వేలు పోగొట్టుకున్నాడు. దీనిపై గురువారం సాయంత్రం దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. దేవరాపల్లి మద్యం షాపులో సేల్స్‌మన్‌గా కదిరి ప్రసాద్ పని చేస్తున్నాడు. తన పీఎఫ్ నగదు జమ కోసం తిమిరాం మద్యం షాపులో పని చేస్తున్న చిన్నా అనే వ్యక్తిని బుధవారం సంప్రతించాడు. దేశపాత్రునిపాలేనికి చెందిన విజయ్ అనే యువకుడి ఫోన్ నంబర్‌ను చిన్నా ఇచ్చాడు. దీంతో ప్రసాద్ ఆ వ్యక్తిని సంప్ర తించాడు. అతను బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్‌కార్డు తదితర వివరాలను చెప్పమన్నాడు. ఓటీపీ వస్తుందని చెప్పమన్నాడు. అతనికి ఆ వివరాలు చెప్పాడు. అంతే 20 నిమిషాల్లో రూ.94 వేలు ప్రసాద్ బ్యాంక్ ఖాతా నుంచి విత్‌డ్రా అయ్యాయి. మోసపోయానని తెలిసి ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డివైడర్‌ను ఢీకొని కార్మికుడి మృతి

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని లారస్ పరిశ్రమ సమీపంలో డివైడర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం బిస్వజిత్ పాండా(24) మృతి చెందినట్టు ఆయన చెప్పారు. సెజ్‌లోని ప్రైవేటు పరిశ్రమలో విధులు ముగించుకుని రాత్రి సమయంలో బైక్‌పై అచ్యుతాపురం వస్తుండగా లారస్ పరిశ్రమ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోని గొలుసు చోరీ

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని గజిరెడ్డిపాలెం గ్రామంలో ఎరిపిల్లి నూకమ్మ బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె మెడలోని 3 తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

వ్యాపారి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎలమంచిలి, ఆగస్టు 1: పట్టణంలో గత నెల 27వ తేదీన జరిగిన బంగారు వ్యాపారి హత్య కేసులో గురువారం మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ ఎస్‌కె. గఫూర్ తెలిపారు. వారిని కోర్టుకు తరలించినట్టు ఆయన చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. గురువారం పరవాడకు చెందిన కె.సాయికృష్ణ, మల్కాపురంనకు చెందిన పూడి నరసింహామూర్తిలను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

బంగారం షాపులో అగ్నిప్రమాదం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1: స్థానిక మెయిన్‌రోడ్డులోని నక్క రాజుకు చెందిన బంగారం వస్తువుల తయారీ దుకాణంలో గురువారం రాత్రి ఐదు కిలోల బరువు ఉన్న గ్యాస్ సిలిండర్ అగ్నికి ఆహుతి కావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో రూ.లక్షా 50 వేల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు తెలిపారు.

బాలికపై అత్యాచారం

» బాలుడిపై పోక్సో కేసు నమోదు

కొత్తూరు, ఆగస్టు 1: ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వి.మాడుగుల మండలానికి చెందిన ఒక కుటుంబం కూలి పని నిమిత్తం వూడేరు వచ్చారు. ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలుడు ప్రేమ పేరుతో తన కుమార్తెను మోసం చేసి అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఆ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తేజేశ్వరరావు చెప్పారు. ఈ కేసును అనకాపల్లి దిశ పోలీసు స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు.

డిపాజిట్‌దారుల సొమ్ము స్వాహా కేసులో పోస్టల్ శాఖ ఉద్యోగులకు జైలు శిక్ష

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్‌దారులను మోసం చేసిన కేసులో ముగ్గురు పోస్టల్ శాఖ ఉద్యోగులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల న్యాయస్థానం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి సీఎన్ మూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సీబీఐ అధికారులు ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం సబ్ పోస్టాఫీస్‌లోని సబ్ పోస్ట్‌మాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్, పోస్టల్ అసిస్టెంట్లు ఐ.సత్యనారాయణ, పి.అప్పలస్వామి కలిసి 2009 అక్టోబరు 21 నుంచి 2012 సెప్టెంబరు 29 వరకూ రికరింగ్ డిపాజిట్లు కలిగిన 153 మంది ఖాతాదారులు మహిళా ప్రధాన్ క్షేత్రీయ బచత్ యోజన (ఎంపీకేబీవై) పథకం కోసం కట్టిన రూ.30,56,429ను వారి ఖాతాలకు జమ చేయకుండా తమ సొంతానికి వాడేసుకున్నారు. నేరపూరిత ఆలోచనతో పథకం ప్రకారం పోస్టల్ శాఖతోపాటు ఖాతాదారులను మోసం చేసిన ముగ్గురిపైనా సీబీఐ కేసు నమోదుచేసింది. సీబీఐ కోర్టు కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు సబ్ పోస్ట్‌మాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్‌కి రూ.ఏడు వేలు, పోస్టల్ అసిస్టెంట్‌లు ఐ.సత్యనారాయణకు రూ.8.29 లక్షలు, పి.అప్పలస్వామికి రూ.8.59 లక్షలు జరిమానా విధించింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

» ముంబై తరువాత అత్యధికంగా విశాఖలోనే సముద్ర మట్టం పెరుగుదల

» బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థ అధ్యయనంలో వెల్లడి



కోతకు గురైన సముద్ర తీరం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో సముద్ర మట్టాలు శరవేగంగా పెరుగుతున్నాయా?, ఈ పరిణామం దేశంలోని తీర నగరాలకు ముప్పుగా పరిణమించనున్నదా?, ఆ జాబితాలో విశాఖ నగరం కూడా ఉందా? అంటే...అవుననే అంటోంది బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ). 2040కల్లా తీర ప్రాంతంలో 1.02 శాతం (6.96 చ.కి. విస్తీర్ణం) నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది.

భూతాపం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తీర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గడచిన 30 ఏళ్లుగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ అండ్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) ఇప్పటికే హెచ్చరికలు జారీచేసింది. ఈ క్రమంలో 2040 నాటికల్లా విశాఖపట్నం తీరంలో 1.02 శాతం భూభాగం నీట మునిగే అవకాశం ఉందని బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) తాజా అధ్యయనం వెల్లడించింది. 1992 నుంచి 2021 వరకూ ఏడాదికి 0.181 సెంటీమీటర్ల వంతున మొత్తం 2.381 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టం పెరగడంతో తీరప్రాంతంలోకి చొచ్చుకు వచ్చింది. ఇదేవిధంగా 2040 నాటికి సముద్రమట్టం 16.7 నుంచి 18.3 సెంటీమీటర్ల మేర పెరిగే అవకాశం ఉందని, తీరంలో సుమారు 1.02 ప్రాంతం (6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) ముంపునకు గురవుతుందని గత నెలలో విడుదల చేసిన అధ్యయనంలో సీఎస్‌టీఈపీ పేర్కొంది. 'సముద్ర మట్టాలు పెరిగి తీర ప్రాంతాలు ముప్పు' అన్న అంశంపై బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థకు చెందిన డాక్టర్ జె.అనూషియా, ఎం.సాయి వెంకటరమణ (ఏయూ ఓషనోగ్రఫీ పూర్వ విద్యార్థి), ఎంఎస్ ప్రదీప్, ఎస్.విద్యలతో కూడిన పరిశోధక బృందం దేశంలోని తీర నగరాలపై అధ్యయనం చేసింది. దేశంలో ముంబై తరువాత ఎక్కువగా హల్దియా, విశాఖపట్నం నగరాలే సముద్ర ముప్పునకు గురవుతాయని అధ్యయనంలో హెచ్చరించింది. విశాఖపట్నంలో పోర్టు నుంచి మంగమారిపేట వరకు తీర ప్రాంతంపై ఈ బృందం అధ్యయనం చేసింది. 2040కల్లా తీర ప్రాంతంలో 1.02 శాతం (6.96 చదరపు కిలోమీటర్లు) నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వ్యవసాయ భూమి 0.48 చ.కి.లు, పచ్చదనం 1.24 చ.కి, పరిశ్రమలు 5.94, నగరం 14.2, వృథా భూములు 2.6, నీటి వనరుల ప్రాంతం 7.96 చదరపు కిలోమీటర్ల వైశాల్యం మేర నీట మునగనున్నది. దీంతో విశాఖ పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేటల్లో సముద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయని ఈ సంస్థ అంచనా వేసింది. పోర్టు నుంచి మంగమారిపేట వరకూ తీర ప్రాంతం ఇప్పటికే చాలావరకు కోతకు గురై నీట మునిగింది. ఏటా విశాఖ తీరంలో సముద్రం ముందుకువస్తోంది. కోస్టల్ బ్యాటరీ, సబ్‌మెరైన్, వైఎంసీఏ ఎదురుగా సముద్ర తీరం కోతకు గురవుతుంది. ఆర్కే బీచ్‌లో స్కాండిల్ పాయింట్‌కు ఒకప్పుడు సముద్రం చాలా దూరంగా ఉండేదని, ఇప్పుడు రుతుపవన సీజన్‌లో నీరు తాకుతోందని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మానవ అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావంతో పెరిగిన భూతాపం వల్ల సముద్ర మట్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకు ఆసియా దేశాలు మినహాయింపు కాదని ఐపీసీసీ ఇప్పటికే స్పష్టంచేసింది. సముద్ర మట్టాలు పెరగడంతో ముంబై తరువాత ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే నగరం విశాఖేనని తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. సముద్ర మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు పక్కనున్న మేహాద్రిగెడ్డలోకి నీరు ప్రవేశిస్తే ఆ ప్రాంతంలో చెట్లు, మడ అడవులు ముంపునకు గురవుతాయి. ఇంకా సముద్ర నీరు మేహాద్రిగెడ్డ లోపలకు ప్రవేశిస్తే భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారతాయి. బీచ్‌రోడ్డు ఇప్పటికే కోతకు గురవుతూనే ఉంది. సముద్ర మట్టాలు పెరిగే క్రమంలో బీచ్‌రోడ్డు ప్రమాదంలో పడనున్నది. ఈ పరిణామం జీవ వైవిధ్యం, పర్యాటక, ఉపాధి రంగాలపై ప్రభావం చూపుతుంది. ఈ సంస్థ చేపట్టిన అధ్యయనం మేరకు 2060కల్లా విశాఖ తీరంలో 1.95 శాతం (13.29 చ.కి.మీ), 2080కల్లా 2.67 శాతం (18.18 చదరపు కిలోమీటర్లు), 2100కల్లా 4.76 శాతం (32.44 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) భూమి నీట మునుగుతుందని అంచనా వేసింది.

విద్యుత్ శాఖ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలి

» జీపీఎఫ్ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ త్రిమూర్తులు

» హోం మంత్రి వంగలపూడి అనితకు వినతి



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న త్రిమూర్తులు

ఎస్.రాయవరం/నక్కపల్లి, ఆగస్టు 1: రాష్ట్ర విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఈపీఎఫ్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలని జీపీఎఫ్ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.త్రిమూర్తులు కోరారు. గురువారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనితకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 2004 ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఈపీఎఫ్ ఉద్యోగులకు ఇచ్చిన 653, 654 జీవో నంబర్ల ప్రకారం జీపీఎఫ్ వర్తింపజేయాల్సి ఉండగా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఆయన వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి అనిత ఈ సమస్యను విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు త్రిమూర్తులు తెలిపారు. అదేవిధంగా నక్కపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, కూటమి నాయకులు, అధికారులు పలు సమస్యలపై హోం మంత్రి అనితకు వినతిపత్రాలు అందజేశారు.

జగన్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

» స్టాండింగ్ కమిటీ ఎన్నిక గురించి ప్రస్తావన

» అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజం

» కార్పొరేటర్ల రాజీనామాపై వైసీపీ అధినేత వ్యాఖ్యలు

» తాడేపల్లి టూర్‌కు ఎనిమిది మంది డుమ్మా

» వారు కూడా టీడీపీ, జనసేనల్లో చేరతారని ప్రచారం



మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్పొరేటర్లు గురువారం తాడేపల్లిలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఈనెల ఏడో తేదీన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగనున్న తరుణంలో జగన్‌ను కార్పొరేటర్లు కలవడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో ఇండిపెండెంట్ కార్పొరేటర్‌తో కలుపుకుని వైసీపీకి 60 మంది కార్పొరేటర్లు ఉండేవారు. వారిలో 12 మంది ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. మిగిలిన 48 మందిలో 40 మంది కార్పొరేటర్లు రెండు బస్సుల్లో బయలుదేరి తాడేపల్లి వెళ్లారు.

మాజీ సీఎం జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నిక విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. ఎన్నికలో గెలుపొందాలంటే 49 మంది కార్పొరేటర్ల బలం అవసరమని, అంత బలం లేకపోయినప్పటికీ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పోటీకి దిగుతున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావులు వివరించారు. పలువురు కార్పొరేటర్లు పార్టీని వదిలి వెళ్లిపోయిన విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి జగన్ స్పందిస్తూ అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజమని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయడం సాధ్యం కాదని, ఈ ఐదేళ్లు ప్రజల్లోనే ఉండాలని కార్పొరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వారిలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు. ఇదిలావుండగా జగన్‌ను కలిసేందుకు వెళ్లని ఎనిమిది మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరడం ఖాయమంటున్నారు. అదే జరిగితే జీవీఎంసీలో వైసీపీ బలం 40కి పడిపోనున్నది.

ఎస్సీ వర్గీకరణ హర్షించదగ్గ విషయం

» ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎంపీ సీఎం రమేశ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను ఉపవర్గీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ ఉపవర్గీకరణ ద్వారా సాకారం అవుతుందని తెలిపారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ జరిగిందని గుర్తుచేశారు. వర్గీకరణ తీర్పుతో లక్షలాదిమంది మాదిగ కులస్థులకు, 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందని సీఎం రమేశ్ పేర్కొన్నారు.

హైవేపైనే వాహనాల పార్కింగ్

నక్కపల్లిలో ప్రతి శుక్రవారం వారపు సంత

» హైవేపై ఉదయం నుంచి ఇష్టానుసారంగా ఆటోలు, వ్యాన్లు, బైక్‌లు నిలిపివేత

» ప్రతి వారమూ ఇదే పరిస్థితి

» పట్టించుకోని పెట్రోలింగ్ సిబ్బంది

» దగ్గరుండి వాహనాలను క్రమబద్ధీకరించాలి

» ఆ దిశగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వేడుకోలు



నక్కపల్లి వారపుసంత హైవే వద్ద ప్రతీ శుక్రవారం ఇదీ పరిస్థితి

నక్కపల్లి, ఆగస్టు 1: నక్కపల్లి హైవేపై ప్రతి శుక్రవారం భయానక పరిస్థితి నెలకొంటుంది. ఇక్కడ శుక్రవారం రోజున ఎండు చేపల వ్యాపారం కొన్ని రూ.లక్షల్లో జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగానే నక్కపల్లి ఎండు చేపల వ్యాపారానికి ఎంతో గుర్తింపు వుంది. సంతలో కూరగాయలు, మేకలు, గొర్రెల వ్యాపారం కూడా బాగానే జరుగుతుంది. అనేక ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు, అమ్మకందారులు వారపుసంతకు వస్తుంటారు. హైవేకు ఆనుకునే వారపుసంత జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు హైవేపైనే ఇష్టమొచ్చినట్టు ఆటోలు, బైక్‌లు, వ్యాన్‌లను నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. హైవేకు సగభాగాన్ని ఆక్రమించే విధంగా వాహనాలను నిలిపివేస్తుండడంతో పాదచారులు, గ్రామీణులు వారపుసంతకు హైవేపై నడిచివెళ్లేందుకు భయపడుతుంటారు. హైవేపై ఇష్టమొచ్చినట్టు వాహనాలను నిలిపివేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనాల నిలిపివేతను పట్టించుకోవడం లేదు. శుక్రవారం సంత రోజున హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడ ఉండి వాహనాలను క్రమబద్ధీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల సంతకు వచ్చే వారికి, వాహనాలకు ఎటువంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదని వారంటున్నారు. ఈ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



హైవేపై ఇష్టమొచ్చినట్టు వాహనాలు పార్కింగ్ చేస్తున్న దృశ్యం



పింఛన్ కోసం లబ్ధిదారుడిని డోలీలో కొరుప్రోలు నుంచి ఎంకేపట్నం తీసుకు వెళుతున్న దృశ్యం

పింఛన్ కోసం పాట్లు

» డోలీలో మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిన దుస్థితి

» కొరుప్రోలు గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

రోలుగుంట, ఆగస్టు 1: పింఛన్ కోసం డోలీలో మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ శివారు కొరుప్రోలులో నెలకొంది. గురువారం ఆ గ్రామానికి చెందిన గెమ్మెలి అప్పారావు(80)ను పింఛన్ కోసం కుటుంబ సభ్యులు మూడు కిలో మీటర్లు డోలీలో ఎంకేపట్నం సచివాలయానికి తీసుకువెళ్లారు. అతనితో పాటు మరో ఇద్దరిని కూడా గ్రామస్థులు డోలీలో తరలించారు. కొన్నేళ్లుగా డోలీలో వెళ్లి పింఛన్లు తీసుకుంటు న్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటికే పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



భక్తుల పూజలందుకున్న మరిడిమాంబ అమ్మవారు



అమ్మవారిని దర్శించేందుకు నదిలో పుట్టెపై వెళుతున్న భక్తులు

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని వైలోవ గ్రామ ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది ఆవతల ఒడ్డున కొలువైన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. శారదా నదిని పుట్టెలు, పడవలపై దాటివెళ్లి అమ్మవారిని దర్శించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులు నదిని దాటే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ బద్ది నారాయణరావు, గ్రామ పెద్దలు, యువకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వరి నారుమడులను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి



వరినారు మడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

కొత్తూరు, ఆగస్టు 1: అనకాపల్లి మండలం సీతానగరం గ్రామంలో వరి నారుమడులను జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో జింక్ దాతులోపం ఎక్కువగా ఉం దని, దాని నివారణకు 200 గ్రాముల జింక్ సల్ఫేట్ రెండు దఫాలుగా పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయాధికారి రామారావు, మండల వ్యవసాయాధికారి రంగాచారి, గ్రామ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తపై కేసు నమోదు

» సహకరించిన అతని తల్లిపై కూడా..



బాధితురాలిని విచారిస్తున్న డీఎస్పీ

అచ్యుతాపురం, ఆగస్టు 1: ప్రేమ పేరుతో దళిత వితంతువుని వివాహం చేసుకొని, నాలుగు నెలలు కాపురం చేసిన తర్వాత ఆమెను వదిలించుకోవడానికి కత్తితో దాడి చేసిన భర్త, సహకరించిన అతన తల్లిపై కేసు నమోదు చేసినట్టు పరవాడ డీఎస్పీ కేవీ.సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోనెంపాలెంలో పలివెల భారతి (28) తన కుమార్తె, తల్లితో కలిసి నివాసముంటోంది. భారతికి 2016లో వివాహం అయింది. ఒక పాప కూడా ఉంది. ఆమె భర్త అనారోగ్యంతో 2021లో చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె తల్లి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన అయినవిల్లి గణేష్ నూక అప్పారావు అలియాస్ వినయ్ రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. 'నిన్ను ప్రేమిస్తున్నాను.. వివాహం చేసుకుంటాను.. ఇప్పుడు ఉన్న పాపను కూడా చక్కగా చూసుకుంటా'నని వెంట పడడంతో 2024 మార్చి 28న ఇద్దరు వివాహం చేసుకున్నారు. వివాహానంతరం అదే గ్రామంలో వీరు వేరు కాపురం పెట్టారు. వీరిద్దరిదీ కులాంతర వివాహం కావడంతో వినయ్ తల్లి భూలక్ష్మికి సుతారమూ ఇష్టలేదు. దీంతో భార్యను వదిలేయమని కొడుకు వినయ్‌ని తల్లి భూలోక వేధించడం ప్రారంభించింది. వినయ్ రోజు తాగి వచ్చి కులం పేరుతో భారతిని దూషించేవాడు. గతనెల 29న భూలక్ష్మి మరో మహిళతో కలిసి కోడలు భారతిని తిడుతూ తన కుమారుడిని వదిలేయమని ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై భారతి అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అక్కడ భార్యాభర్తలిద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. తర్వాత గత నెల 31న భారతిపై వినయ్ దాడి చేశాడు. దీంతో ఆమె మెడ, ఎడమ చేయి, మోచేయిపై గాయాలయ్యాయి.దీంతో భారతిని ఆమె తల్లి అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిందని డీఎస్పీ సత్యనారాయణ వివరించారు. విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ బుచ్చిరాజు ఎస్సీ, ఎస్టీ, అత్యాచారంతో పాటు ఇతర సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంగనీస్ దిగుమతిలో విశాఖ పోర్టు రికార్డు

» జూలైలో 5,66,301 టన్నుల దిగుమతి

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు మాంగనీస్ దిగుమతిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఏడాది మే నెలలో 17 నౌకల ద్వారా 4,37,270 టన్నుల మాంగనీస్‌ను దిగుమతి చేసుకోగా అప్పటికి అదే రికార్డు. దానిని జూలై నెలలో పోర్టు అధిగమించింది. గత నెలలో 15 నౌకల ద్వారా 5,66,301 టన్నుల మాంగనీస్‌ను దిగుమతి చేసుకొని కొత్త రికార్డు సృష్టించింది. పోర్టు 90 ఏళ్ల చరిత్రలో ఇదో మైలురాయి అని చైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. ఈ ఘనత సాధించిన పోర్టు ట్రాఫిక్ విభాగాన్ని అభినందించారు.



రేడియో స్టేషన్ డైరెక్టర్ కృష్ణారావుకు స్థలం ధ్రువ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

రేడియో స్టేషన్ కోసం 50 సెంట్ల కేటాయింపు

చింతపల్లి, ఆగస్టు 1 : మండల కేంద్రంలో ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి) స్టేషన్ ఏర్పాటుకు 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేసినట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం సర్వే ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ జె.కృష్ణారావుకు తహసీల్దార్ అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చింతపల్లి మండల కేంద్రానికి ఆల్ ఇండియా రేడియో రిలే స్టేషన్ మంజూరు చేసిందన్నారు. రిలే స్టేషన్ ఏర్పాటుకు రూ.12.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ మేరకు రిలే స్టేషన్, టవర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆల్ ఇండియా రేడియో స్టేషన్ అధికారులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తులను పరిశీలించి చింతపల్లి మండల కేంద్రం వైటీసీ వెనుకనున్న కొండపై 50 సెంట్లు సర్వే చేసి అప్పగించామన్నారు. స్థలం కేటాయించడంతో స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు ఆల్ ఇండియా రేడియో స్టేషన్ అధికారులు తెలిపారన్నారు. వచ్చే ఏడాదికి రిలే స్టేషన్ ప్రాంతీయ ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు.కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియోస్టేషన్ డైరెక్టర్ క్రిష్ణారావు, సర్వేర్ సుభాకర్, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

వెలుగు సీసీపై చర్యలు

సీఐటీయూ డిమాండ్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 1 : డ్వాక్రా సంఘాల సభ్యులపై వివక్ష చూపిస్తున్న వెలుగు సీసీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలుగు సీసీ వరలక్ష్మి డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పించేందుకు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని దూషిస్తున్నారన్నారు. అంతేకాకుండా డ్వాక్రా సభ్యులకు అందుబాటులో ఉండడం లేదని, తరచూ విధులకు ఎగనామం పెడుతున్నార న్నారు. క్లస్టర్ వీవోఏల జీతాల బిల్లులు కూడా పెట్టడం లేదన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యం ఉంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సీసీపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీఆర్డీఏ పీడీ చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే డ్వాక్రా సంఘాల సభ్యులతో ఆందోళనలు ఉధృతం చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు.

రమా కుటుంబానికి శ్రావణ్ పరామర్శ



రమాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్

హుకుంపేట, ఆగస్టు 1 : ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మా రమా కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. హుకుంపేట మండలం దాటిగుమ్మడిలో గురువారం ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మా రమా భర్త సింహాచలం అలియాస్ కొమ్మా బాబు(42) సంస్మరణలో ఆయన పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సింహాచలం లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శెట్టి లక్ష్మణుడు, బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, సాగరి సుబ్బారావు, శిరగం సూర్యకాంతం, తామర్ల సత్యనారాయణ, పలాసి శశిభూషన్, అచ్చిబాబు, మహేశ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువులకు తొలి ఔషధం

సీడీపీవో లక్ష్మిదేవి




పూజారిపాకలులో ర్యాలీ చేస్తున్న సీడీపీవో లక్ష్మిదేవి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 1 : తల్లిపాలు శిశువులకు తొలి ఔషధమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. గురువారం మండలంలోని పూజారిపాకలు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ గిరిజనులు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. అలాగే ఆరు నెలల వరకు శిశువులకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. పాలు క్రమంగా పెట్టడం వల్ల తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, రమలక్ష్మి పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని పిడకోట పంచాయతీ కేంద్రంలోని తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలోని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని వైద్య సిబ్బంది హెచ్ఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొవ్వాలో క్యాన్సర్ శిబిరం



డుంబ్రిగుడ, ఆగస్టు 1 : మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సొవ్వాలో గురువారం ఉచిత క్యాన్సర్ ప్రాథమిక పరీక్షల శిబిరం నిర్వహించారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్‌ఫౌండేషన్, పాడేరు ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను వైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా 116 మంది గిరిజనులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కనకేశ్వరరావు, వైద్యాధికారి నజీబ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పింఛన్ల పంపిణీ సందడి

95 శాతం మందికి అందజేత

కొండకోనలకు వెళ్లి ఇచ్చిన సిబ్బంది



అరకు : బ్యాంకు వీధిలో ఓ దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ దాసుబాబు



డుంబ్రిగుడ : పింఛన్లు ఇస్తున్న సచివాలయ సిబ్బంది



అనంతగిరి : ఊటమామిడిలో రైతు కూలీలకు పింఛన్ అందిస్తోన్న డిజిటల్ అసిస్టెంట్

అరకులోయ, ఆగస్టు 1 : అరకులోయ మండలంలో 14 గ్రామపంచాయతీల పరిధిలో గురువారం సాయంత్రానికి 95 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సీహెచ్ వెంకటేశ్ తెలిపారు. ఉదయం కొద్ది సేపు ముసురు వాతావరణం నెలకొనడంతో కొంత సమయం పంపిణీకి జాప్యం జరిగిందన్నారు. మండలంలో 6559 మంది పింఛనుదారులకు రూ.2,80,60,500 పంపిణీ చేయాల్సి ఉండగా, 6159 మందికి సుమారు రూ.2,65,11,000 అందజేసినట్టు వెల్లడించారు. మిగిలిన 5 శాతం శుక్రవారం ఉదయాన్నే అందజేస్తామన్నారు.పెదలబుడు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ దాసుబాబు, వార్డుమెంబర్లతో కలిసి అరకులోయలో కొండవీధి, బ్యాంకు వీధిలో పలువురికి పింఛన్లు అందజేశారు.

అనంతగిరి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పంపిణీలో ప్రత్యేకతను చాటుకుంటోంది. పింఛన్‌దారులు ఎక్కడ ఉంటే అక్కడకు సిబ్బంది వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. మండలంలోని వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగులు, తదితర పింఛన్లు కలిసి 6,069 ఉంటే.. గురువారం 5,808 పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో నగేష్ తెలిపారు. సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందినట్టు చెప్పారు. 95 శాతం పింఛన్లు పంపిణీకి కృషిచేసిన సిబ్బందిని అభినందించారు.

డుంబ్రిగుడ : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం గిరిజన గ్రామాల్లో పండుగలా సాగింది. మండల వ్యాప్తంగా సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల ఉద్యోగులు గిరిజన గ్రామాలకు ఉదయాన్నే చేరుకుని ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 95 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందని మండల అభివృద్ధి అధికారిణి జయ ఉమ తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేసి పూర్తి చేస్తామని ఆమె తెలిపారు.

గంజాయి జోలికి వెళ్లొద్దు

» విద్యార్థులకు పోలీసుల హితవు

» కళాశాలల్లో అవగాహన సదస్సులు



హుకుంపేటలో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు



పాడేరు : విద్యార్థులతో సీఐ నవీన్‌కుమార్

పాడేరు రూరల్, ఆగస్టు 1 : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లి విద్యార్థులు తమ జీవితాలను బుగ్గి చేసుకోవద్దని స్థానిక సీఐ డి.నవీన్ కుమార్ అన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ జీవితాలను విద్యతో మెరుగుపర్చుకునేందుకు మాత్రమే కృషి చేయాలని, చెడు స్నేహాలు, మత్తుపదార్థాలను వినియోగించడం వంటి వాటికి దూరంగా ఉండాలని సీఐ సూచించారు. అలాగే విద్యార్థులకు మత్తు పదార్థాలు అందించే వారి వివరాలను, ఇతర చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని తమకు అందించాలన్నారు.విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తమను సంప్రదించాలన్నారు. అధ్యాపకుల సూచనలు, సలహాలను పాటించి ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట : గిరిజన యువత గంజాయి, సారా వంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ సన్యాసినాయుడు కోరారు.

గురువారం హుకుంపేట ప్రభుత్వ కళాశాలలో సారా, గంజాయి నియం త్రణ ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గిరిజన యువత ప్రలోభాలకు లోబడి, డబ్బు సంపాదించవచ్చనే దురాశతో గంజాయి, సారా వంటి వ్యాపారాలు చేసేందుకు ఎంత మాత్రం ప్రయత్నించవద్దన్నారు.

ఈ ప్రాంతంలో కాఫీ, మిరియాలు, తేనే, ఇతర పంటల సాగుపై దృష్టి నిలిపి ఆదాయ మార్గాలను ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీశ్, ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందకే సప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి : డీఎంహెచ్‌వో

సీలేరు, ఆగస్టు 1 : సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే సప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి చెందినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమల్ బాషా తెలిపారు. బుధవారం 'సప్పర్ల ఆశ్రమ విద్యార్థి మృతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఆస్పత్రి వైద్యాధికారిని విచారణకు ఆదేశించినట్టు చెప్పారు. దీంతో వైద్యాధికారి విద్యార్థి స్వగ్రామం ఎం.బూసికొండను సందర్శించి విచారణ చేపట్టినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు. సప్పర్ల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జర్తా సామ్యుల్‌కి గత నెల 24న జ్వరం వచ్చిందన్నారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని ఆదే రోజు పాఠశాల నిర్వాహకులు స్వగ్రామానికి పంపించారు. మూడు రోజుల తరువాత జ్వరం తగ్గిందని, 28న మరోసారి విద్యార్థి సామ్యుల్‌కి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ధారకొండలోని ఆర్ఎంపీ వైద్యుడు వద్ద చికిత్స చేయించుకుని స్వగ్రామానికి వెళ్లిపోయారు. 29న రాత్రి కడుపునొప్పి, వాంతులు రావడం, అదే రోజు వర్షం కురుస్తుండడం వల్ల ఆస్పత్రికి తీసుకొని వెళ్లలేకపోయారన్నారు. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన విద్యార్థి మృతి చెందాడన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు సకాలంలో ఆస్పత్రికి తీసుకొని వెళ్లకపోవడం, నాటు వైద్యం చేయించడం వల్ల విద్యార్థి మృతి చెందారని డీఎంహెచ్‌వో తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల మరమ్మతుకు చర్యలు

» టీడబ్ల్యూ డీఈఈ చాణిక్యరావు



బాలుర ఆశ్రమ పాఠశాలలను పరిశీలిస్తున్న చాణిక్యరావు

చింతపల్లి, ఆగస్టు 1 : గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు టీడబ్ల్యూ డీఈఈ చాణిక్యరావు అన్నారు. గురువారం మండలంలోని బాలురు, బాలికలు ఆశ్రమ పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల పోస్టు మెట్రిక్ వసతిగృహాలను ఆయన పరిశీలించారు. అనంతరం డీఈఈ మాట్లాడుతూనాడు-నేడు పథకం వర్తించని ఆశ్రమ పాఠశాలల తరగతి గదులు, వసతి గృహాలను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రధానంగా వసతి, తరగతి గదులు, రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్, మరుగుదొడ్లు బాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏపీఆర్ జూనియర్ కళాశాల వసతి, తరగతి గదులు కారిపోతున్నాయన్నారు. అలాగే ఐటీఐ పోస్టు మెట్రిక్ వసతిగృహంలోనూ లీకేజీలు ఉన్నాయన్నారు. బాలికలు ఆశ్రమ పాఠశాలలో రక్షిత మంచి నీటి పథకం, బాలూర ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ఈమేరకు ఆశ్రమ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌళిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

వసతి గృహాలకు అరువు రూపంలో గ్యాస్ సరఫరా చేయలేం : జీసీసీ డీఎం

చింతపల్లి, ఆగస్టు 1 : గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలకు రుణ రూపంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయలేమని జీసీసీ డీఎం పి.దేవరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో గిరిజన సహకార సంస్థ నిధులతో రెండు, మూడు నెలల పాటు గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలకు అరువు రూపంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. 2024 ఏప్రిల్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ జీసీసీ బ్యాంక్ ఖాతాను నిలిపివేసినట్టు చెప్పారు. దీంతో ఈ ఖాతాల్లోనున్న నగదు తీసుకుని ఖర్చు చేసే వెసులుబాటు లేదన్నారు. నెలలో వసతిగృహాలకు సుమారు 600 సిలిండర్లు అవసరం పడుతుందన్నారు. హెచ్‌పీసీఎల్ అధికారులు సైతం జీసీసీకి అరువు పద్ధతిలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం లేదన్నారు. ఈ కారణంగా వసతిగృహాలకు గ్యాస్ అరువు రూపంలో పంపిణీ చేయలేకపోతున్నామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్య పరిష్కారం జరిగే వరకు వసతి గృహాల నిర్వాహకులు నగదు చెల్లించి గ్యాస్ సిలిండర్లు తీసుకోవాలని డీఎం తెలిపారు.

రాయితీపై గోకులం షెడ్ల నిర్మాణం

» పశుసంవర్ధకశాఖ ఏడీ డా.చంద్రశేఖరరావు



చింతపల్లి, ఆగస్టు 1 : గిరిజన ప్రాంతాల్లో రాయితీపై గోకులం షెడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో గోకులం నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్కో మండలం నుంచి 25 గోకులం షెడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పశువుల సంఖ్య ఆధారంగా వివిధ రకాల యూనిట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు కేవలం రూ.11,500 చెల్లిస్తే సరిపోతుందని, ప్రభుత్వం సుమారు రూ.1.3 లక్షల నిధులు రాయితీగా అందజేస్తుందన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు వేర్వేరుగా షెడ్లు నిర్మించేందుకు ప్రత్యేక రాయితీలు కేటాయించడం జరిగిందన్నారు. రైతులు సొంత పట్టా భూమి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల గిరిజన రైతుల ఉంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోనున్న పశువైద్యాధికారిని సంప్రదించాలన్నారు.

కడుపునొప్పితో ఆశ కార్యకర్త మృతి



పోర్తిమ(ఫైల్)

ముంచంగిపుట్టు, ఆగస్టు 1 : మండలంలో గల మారుమూల రంగబయలు పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త తీవ్రమైన కడుపునొప్పితో గురువారం మృతి చెందింది. దీనికి సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లబ్బూరు పీహెచ్‌సీ పరిధిలో ఆశ కార్యకర్తగా వంతాల పోర్తిమ(46) పని చేస్తోంది. తన విధులకు సంబంధించి మందులు తీసుకువచ్చేందుకు గురువారం సిద్ధమైంది. ఆ సమయంలో తీవ్రంగా కడుపునొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయింది. కడుపు నొప్పిని తట్టుకోలేకపోతున్నా అంటూ తమతో మాట్లాడుతూనే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

జీవో నంబరు-3 సాధించుకుందాం

» గిరిజన ఉద్యోగుల సంఘం నేత గంగరాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

చింతపల్లి, ఆగస్టు 1 : ఐక్యతగా జీవో నంబరు-3 సాధించుకుందామని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శి యూవీ గిరి, గెమ్మెలి మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివాసీ దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై వివిధ సంఘాల నాయకులతో సంఘం మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని చింతపల్లి గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీల ప్రధాన డిమాండ్లు జీవో నంబరు-3, భూబదలాయింపు, పీసా చట్టాలు అమలు చర్చిండం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు శశి కుమార్, సతీశ్ కుమార్, లోచలి చిట్టినాయుడు పాల్గొన్నారు.

సీలేరులో ఐదు గంటలు అంధకారం

సీలేరు, ఆగస్టు 1 : జీకేవీధి మండలం సీలేరు పంచాయతీలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సీలేరుతో పాటు చింతపల్లిక్యాంప్, బూసుకొండ, చంద్రుపల్లి, లైకోన్‌పూర్ తదతర గ్రామాల్లో అంధకారం నెలకొంది. సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే 33/11 కేవీ లైన్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి గురువారం సాయంత్రం 5.40 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జెన్‌కో సిబ్బంది ఫీజులు వేసి లైన్ చార్జి చేస్తున్నా వెంటనే మరలా ట్రిప్ అయి విద్యుత్ సరఫరాలో అంతరాయం అవుతున్నది. దీంతో జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది జలవిద్యుత్ కేంద్రం నుంచి సీలేరు వచ్చే 11 కేవీ లైన్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యను మూడు గంటల పాటు శ్రమించి రాత్రి పదిన్నర గంటలకు పరిష్కరించారు.

గ్యాస్ ఈకేవైసీ పేరిట దోపిడీ

... 5వ పేజీ తరువాయి

బాధిత వినియోగదారులు వాపోతున్నారు.

మీ-సేవాలోనూ నగదు వసూళ్లు

ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మండల కేంద్రంలో ఉన్న మీ-సేవా కేంద్రం నిర్వాహకులతో సిండికేట్‌గా మారి వసూళ్లు చేస్తున్నారు. అనధికారికంగా గ్యాస్ ఏజెన్సీ లాగిన్ ఐడీని మీ-సేవా కేంద్రానికి ఏజెన్సీ నిర్వాహకులు ఇచ్చారు. దీంతో మీ-సేవా కేంద్రం నిర్వాహకులు సైతం ఈకేవైసీ చేయించేందుకు రూ.400 నుంచి రూ.500వసూలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఈకేవైసీని ఉచితంగా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

... 5వ పేజీ తరువాయి

తనకు అవకాశం ఇవ్వాలని, అందుకు కావాల్సిన అర్హతలన్నీ తనకు ఉన్నాయని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద బలంగా డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తాను భారీగా ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ నేతలందరితో సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయ సేకరణ జరిపి పార్టీ అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తానని సుబ్బారెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. జగన్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని తనను కలిసిన ఆశావహులకు సుబ్బారెడ్డి చెబుతున్నారు.

తొలిరోజు 95.89 శాతం పెన్షన్ల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

గున్నమ్మ, అమ్మన్నలకు రూ.4 వేలు చొప్పున పెన్షన్ సొమ్మును కలెక్టర్ అందించారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, వెలుగు ఏపీఎం ఈశ్వర్‌బాబునాయుడు, ఈవోపీఆర్‌డీ రమేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జి.మాడుగుల, జూన్ 1 : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడు త్రినాథ్ కోరారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన చేపట్టారు. వినియోగంతో ఎదురయ్యే అనర్థాల గురించి వివరించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

హుకుంపేట ఆగస్టు 1 : క్షయ వ్యాధి గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టీబీ సూపర్‌వైజర్ సదానందం అన్నారు. మజీవలస గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం క్షయ వ్యాధి, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తర్వాత కంటే ముందే నివారణ చర్యలు చేపట్టడం అవసరం అన్నారు. పరిశుభ్రతతో సగం వ్యాధులు రాకుండా చేయవచ్చన్నారు. అలాగే వ్యాధులు సంక్రమించేందుకు కారణాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.నాగేశ్వరరావు, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ధనరాజు, ఏఎన్ఎం ఇంద్రావతి, హెల్త్ అసిస్టెంట్ రామునాయుడు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి గీసిన రమణీయ చిత్రం



మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం సమీపంలో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో గురువారం సుందరమైన దృశ్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉరకలేస్తూ ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ, నీలి రంగులో నీలిమేఘాలు, ఎత్తైన పచ్చని గిరులు ప్రకృతి గీసిన చిత్రంలా దర్శనమిచ్చింది. ఆ సమయంలో ఆదృశ్యాన్ని చూసిన వారంతా ప్రకృతి రమణీయతకు పులకరించిపోయారు.

ఎంతసేపు తనివి తీరని ఆ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ముంచంగిపుట్టు

☛ సంక్షిప్తంగా..

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 27 వరకు గడువు : డీఈవో

పాడేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 27 వరకు మాత్రమే గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్ చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అలాగే టెన్త్‌లో చేరే విద్యార్థులకు 14 ఏళ్లు నిండాలని, ఇంటర్‌లో చేరే విద్యార్థులు టెన్త్ పాసై 15 ఏళ్లు నిండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

కొయ్యూరు, ఆగస్టు 1 : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో సీతయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని బంగారమ్మపేట, అంతాడ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు, గణితంలో విద్యార్థుల ప్రావీణ్యాన్ని పరీక్షించారు. ఆ సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 15 రోజుల అనంతరం మరోమారు పాఠశాలకు వస్తానని, అప్పటికి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం మెరుగు పరచాలని ఆదేశించారు. అనంతరం అంతాడలో పింఛన్లు పంపిణీ చేశారు.

వింతైన పుట్టగొడుగు



జి.మాడుగుల, జూన్ 1: మండలంలోని బీరం పంచాయతీ వీ.కోడాపల్లిలో ఒక గిరిజనుడి పెరట్లో వింతైన పుట్టగొడుగు పుట్టింది. ఈ రకమైన పుట్టగొడుగు గిరిజనులు చిక్కానికి పోలి ఉండడంతో చిక్కం కొక్కు అని పిలుస్తారు. చాలా అరుదుగా ఈ పుట్టగొడుగులు పుట్టుకొస్తాయని, ఇవి విషపూరితమని గిరిజనులు అంటున్నారు.

కార్మికుల తొలగింపు అన్యాయం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్

పాడేరు రూరల్, ఆగస్టు 1 : వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈ నెల 5న సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం పలు రంగాల్లో స్కీమ్ వర్కర్లను తొలగిస్తున్నదని ఆరోపించారు. అటువంటి చర్యలు సరికాదన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, వెలుగు పథకాల్లో పని చేస్తున్న కార్మికులు పాలకులకు బానిసలు కారని, ఏళ్ల తరబడి ప్రజలకు సేవలు అందిస్తున్న వారిని అకారణంగా తొలగించాలనుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కార్మికుల తొలగింపు చర్యలకు స్వస్తి పలకాలని, లేకుంటే ఐక్యంగా ఉద్యమిస్తామని చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. ఈ నెల 5న తలపెట్టిన స్కీమ్ వర్కర్ల ధర్నానుజయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నేతలు పోతురాజు,సుందరరావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముంచంగిపుట్టు, ఆగస్టు 1 : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే సర్పంచులు, ఎంపీటీసీల సమక్షంలో మండల అభివృద్ధిపై చర్చించనున్నట్టు తెలిపారు.

కల్వర్టు నిర్మాణం కోసం మాజీ మంత్రికి వినతి



శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ, ఆగస్టు 1 : మండలంలోని సాగర పంచాయతీ ముగిరిగుడ గ్రామంలో కల్వర్టు నిర్మించాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో కల్వర్టు కొట్టుకుపోయిందని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన స్థానిక గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి కల్వర్టు నిర్మించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్థులు భాస్కరరావు, టీడీపీ నాయకులు చిన గెన్ను, అప్పలరాజు, బొంజుబాబు, కామేష్‌పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాజబాబు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 1 : ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై చర్చించేందుకు ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒకరు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు కొర్ర బలరామ్, కొర్ర మేల్లేశ్వరరావు, రీమల పాలు, లకే రామచంద్రుడు, వనపల జోగిరాజు, గొర్లె వీర వెంకట్, గడుతూరి పరమేశ్వరరావు, కొర్ర గౌతం పాల్గొన్నారు.